క్లుప్తంగా

నేడు 'చలో విశాఖ డెయిరీ' జయప్రదం చేయండి

అచ్యుతాపురం రూరల్ : పాడి రైతుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం మడుతూరు, చీమలాపల్లి, భోగాపురం, అప్పన్నపాలెం, కొండకర్ల గ్రామాల రైతులతో కలిసి కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. చలో విశాఖ డెయిరీ కార్యక్రమంలో రైతులందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమానాయుడు పిలుపునిచ్చారు.

కార్మికులకు 20 శాతం బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు రాము, సోమునాయుడు

అచ్యుతాపురం రూరల్ : దసరా, దీపావళి సందర్భంగా పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులకు 20 శాతం బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బోనస్ అనేది కార్మికులకు బకాయి పడ్డ వేతనమని, యాజమాన్యాల ఇష్టాలను అనుసరించి చెల్లించేది కాదన్నారు. పరిశ్రమల్లో కార్మికులు అడిగినంత వరకూ బోనస్‌లు ఇవ్వడం లేదని, అధికారులు జోక్యం చేసుకుని చట్ట ప్రకారం అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

పాములవాకలో వైద్య శిబిరం



అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

కోటవురట్ల: పాములవాకలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వేములపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. మహిళలు ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు కోరారు. ఈ శిబిరంలో సర్పంచ్ డి.సత్యవతి, ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

ఎస్.రాయవరం: గ్రామాల్లో సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో మీనా కుమారి ఆదేశించారు. మండలంలో పలు గ్రామాల్లో ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ మంగళవారం విస్తృత పర్యటన చేశారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆమె తొలిసారిగా మండలంలో అన్ని గ్రామాలను సందర్శించి సర్వేలు, పారిశుధ్య పనులపై ఆదేశాలు జారి చేశారు.

పీఏసీఎస్ అభివృద్ధికి రైతులు సహకరించాలి

మునగపాక: సహకార సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలని చూచుకొండ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట నరసింగరావు కోరారు. మండలంలోని చూచుకొండ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి సంఘం రూ.5,47,087 మేర నికర లాభం ఆర్జించిందన్నారు. సంఘ సీఈవో ఆడారి వెంకటస్వామి నాయుడు సంఘ నివేదికను చదివి వినిపించారు. సంఘ పర్సన్లు పెంటకోట రఘురామ్, వెంకునాయుడు, పాల సంఘ అధ్యక్షులు కాండ్రేగుల నాయుడు, రాజశేఖర్, కాళ్ల చంద్రమోహన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ శిక్షణ ప్రారంభం



క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఐ నమ్మి గణేష్

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు కబడ్డీ శిక్షణ తరగతులు సీఐ నమ్మి గణేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. 52వ అంతర్ జిల్లాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మావతి, పీడీ శ్యామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం.. సేవలు నిర్వీర్యం.!



కైలాసపట్నం గ్రామ సచివాలయం

- కూటమి ప్రభుత్వ కుట్రతో తగ్గిపోయిన సేవలు
- సిబ్బంది కొరతతో వెలవెల
- అర్జీదారులకు తప్పని అవస్థలు

కోటవురట్ల: ప్రజల ముంగిటకే సమస్త సేవలు అందాలి. గ్రామీణ ప్రజలు సంక్షేమ పథకాలు, ధ్రువపత్రాల కోసం ఇబ్బందులు పడకూడదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇదంతా ఆలోచించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో రూ.లక్షలు వెచ్చించి అధునాతన భవనాలు నిర్మించారు. అక్కడే సమస్త సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం లక్షల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. సచివాలయ ఉద్యోగులకు తోడుగా సేవను జోడించి వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారు. డబ్బులు ఆశించకుండా సేవే పరమావధిగా వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాల సంక్షేమ పథకాలకు సంబంధించిన బాగోగులు చూడడమే కాకుండా విద్యార్థులకు ధ్రువపత్రాలు సకాలంలో అందేలా చూసేవారు. గ్రామం దాటి మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేకుండా సమస్త సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదంతా గతం.

ప్రజల వద్దకు పాలన, గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా మాజీ సీఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ మనుగడపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యపు నీడలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో లక్షలు వెచ్చించి గ్రామ సచివాలయ భవనాలు నిర్మించగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వ రాగానే వాటిని నిర్లక్ష్యం చేస్తోంది. వ్యవస్థను నిర్వీర్యం అయ్యేలా ప్రణాళిక చేస్తోంది. ఉత్తమ సేవలందించిన గ్రామ సచివాలయాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

17 సచివాలయాలలో సేవలు

మండలంలో 25 పంచాయతీలు ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 19 గ్రామ సచివాలయాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క గ్రామ సచివాలయ భవనాన్ని సుమారు రూ.35 లక్షల నుంచి రూ.42 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఇందులో 17 సచివాలయాల భవనాలు పూర్తి కావడంతో పాటు ఉద్యోగుల ద్వారా సేవలు అందించేవారు. బోడపాలెంలో సచివాలయ భవనం ఫినిషింగ్ స్టేజ్‌కు చేరుకోగా.. ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోకుండా ఏళ్లు గడిచిపోతున్నాయి. చినబొడ్డేపల్లిలో భవనం పనులు 50 శాతం పూర్తయి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

ఉద్యోగులంతా ఏమయ్యారు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామ సచివాలయంలో పూర్తి స్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండేవారు. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, సెక్రటరీ, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇలా 11 మంది ఉద్యోగులు గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల జాడ కనిపించకుండా పోయింది. ఎపుడూ ఉద్యోగులు, లబ్ధిదారులతో కళకళలాడే సచివాలయాలు ప్రస్తుతం జీవకళను కోల్పోయి వెలవెలబోతున్నాయి. మండల కేంద్రంలోనే పూర్తి స్థాయిలో ఉద్యోగులు లేరు. ఇద్దరు, ముగ్గురు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది కొరతతో వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు చేయాల్సిన వివిధ పనులను మహిళా పోలీసులు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలోని 17 గ్రామ సచివాలయాలలో 124 మంది సిబ్బంది ఉండేవారు. ఈ సచివాలయాల పరిధిలో 327 మంది వలంటీర్లు తమ పరిధిలో సేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం రాగానే వలంటీరు వ్యవస్థను పక్కనపెట్టేసింది. ఇక సచివాలయ ఉద్యోగులను వేర్వేరు శాఖలకు బదిలీలు చేయడంతో చాలా చోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం మండలంలో 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిజిటల్ అసిస్టెంట్లు 9 ఖాళీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు 1, వీఆర్వోలు 6, డీడీవోలు 7 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 139 సేవలు అందేవి. ఇప్పుడు దాదాపు వీటిలో 75 శాతం చాలా వరకు సేవలు తగ్గించేశారు.

మహిళా పోలీసులే దిక్కు అయ్యారు..



సచివాలయాలలో ప్రధానంగా ఉండాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల జాడ లేదు. వాళ్లు చేయాల్సిన పనులను మహిళా పోలీసులతో చేయిస్తున్నారు. ఇంత కంటే దారుణం ఎక్కడా ఉండదు.

– వంతర నాగేశ్వరరావు, రాజగోపాలపురం

బదిలీలతో ఖాళీలు ఏర్పడ్డాయి..



మండలంలోని 17 సచివాలయాల ద్వారా సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది సచివాలయ ఉద్యోగులు బదిలీలపై వేర్వేరు మండలాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఖాళీలు ఉండడంతో ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. తప్పని పరిస్థితుల్లో కొన్ని సచివాలయాలలో మహిళా పోలీసులే ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల సమస్యలు చూస్తున్నారు.

– వి.చంద్రశేఖర్, ఎంపీడీవో, కోటవురట్ల

తోటాడలో డీపీవో పర్యటన



తోటాడలో చేపల అమ్మకాలను పరిశీలిస్తున్న డీపీవో సందీప్

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీలో మంగళవారం డీపీవో ఇ.సందీప్ సుడిగాలి పర్యటన చేశారు. పంచాయతీ పరిధిలోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం చేపల అమ్మకాలను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ ఎలా ఉందో స్వయంగా పరిశీలించి సచివాలయంలో గ్రామస్తులతో మాట్లాడారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బుట్టల్లో వేసుకొని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కుళ్లిన చేపలు అమ్మకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, పెద్దలు దొడ్డి రమేష్, పాలమరశెట్టి మురళి, ఈవోఆర్డీ ఎం.సోమరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులకు పాల్పడితే చర్యలు



సీఐ అప్పన్నకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

పాయకరావుపేట: నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తున్న పాత్రికేయులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి.అప్పన్న స్పష్టం చేశారు. పాయకరావుపేటలో ఓ పత్రిక విలేకరిపై మండలంలోని ఈదటం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నేమాల సత్యనారాయణ దౌర్జన్యానికి ప్రయత్నించిన విషయమై నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పాత్రికేయులు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ అప్పన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. విలేకరిపై దౌర్జన్యానికి ప్రయత్నించిన టీడీపీ నాయకుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. దీనిపై స్పందించిన సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్

నక్కపల్లి: కేంద్రప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన స్వస్థ్ సశక్త్ నారీ పరివార్ అభియాన్ పేరిట ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నక్కపల్లి ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్, మరో వైద్య నిపుణుడు ఈశ్వరప్రసాద్ కోరారు. మంగళవారం ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడంతో పాటు, మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎన్‌టీ, రక్తపోటు, క్యాన్సర్, క్షయ, షుగర్ వంటి పరీక్షలను ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, ఆస్పత్రి వైద్య సిబ్బంది ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం



గాయత్రీదేవి అలంకరణలో వాసవీకన్యకా పరమేశ్వరీ అమ్మవారు



గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

యలమంచిలి రూరల్: పట్టణంలో పలు ఆలయాలు, చలువ పందిళ్లలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు పలు అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ బంగారుశెట్టి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వీధిలో గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో రెండోరోజు అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల చలువ పందిళ్లలో అమ్మవారి విగ్రహాల వద్ద భవానీ భక్తులు పూజలు చేశారు.

పంచాయతీ షాపుల వేలం



షాపుల అద్దెకు వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

పాయకరావుపేట: పట్టణంలోని పంచాయతీ షాపులకు మంగళవారం వేలం నిర్వహించారు. చిత్రమందిర్ ఎదురుగా గల పాత షాపులు, బస్టాండ్ వైపు ఉన్న కొత్త షాపుల అద్దెకు వేలం వేసినట్టు ఈవోఆర్డీ కె.డేవిడ్ తెలిపారు. 2026 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2027 మార్చి 31 వరకు కాల పరిమితితో వేలం వేశామన్నారు. క్యాంటీన్ రూ.40,100, పాత షాపుల్లో ఒకటో షాపు రూ.13 వేలు, 2వ షాపు వాయిదా, 3వ షాపు రూ.12,500, 4వ షాపు రూ.13,200, 5వ షాపు రూ.13 వేలు, 6వ షాపు రూ.20,500 వేలం ఖరారైనట్టు తెలిపారు. కొత్త షాపుల్లో ఒకటో షాపు వాయిదా పడిందన్నారు. రెండో షాపు రూ.10,400, 3వ షాపు వాయిదా, 4వ షాపు రూ.17,600, 5వ షాపు రూ.14,500, 6వ షాపు రూ.10 వేలు, 7వ షాపు వాయిదా, 8వ షాపు రూ.9,500కు అద్దె వేలం పాటలు జరిగాయన్నారు. వాయిదా పడిన షాపులకు మళ్లీ వేలం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

మూడు సచివాలయాల్లో నేడు ఆధార్ క్యాంపులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి, మునగపాక-2, నాగులాపల్లి-2 సచివాలయాల్లో బుధవారం ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి ఆపై వయస్సున్న ప్రతి ఒక్కరూ ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐ శిక్షణకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సాయం

మునగపాక: మునగపాకలోని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ఐదుగురు విద్యార్థులు ఉచితంగా ఐటీఐ చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ మళ్ల జోగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు గురువారంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98858 72688, 87128 95128 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పేదరిక నిర్మూలనకు పాటుపడాలి

మునగపాక: పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో మంగళవారం పీ–4 సర్వే పూర్తయిన తరువాత చేపట్టబోయే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసం కృషి చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు అవసరమైన అవసరాలు గుర్తించాలన్నారు. అట్టడుగున ఉన్న నిరుపేదలను ఎవరైతే దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తారో వారికి చేదోడు కల్పించేలా చూడాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


దోమ తెరల పంపిణీ



బోనుకొత్తూరులో దోమతెరను అందిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: దోమల నివారణతోనే వ్యాధులను దూరం చేయొచ్చని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. కె.వెంకటాపురం శివారు బోను కొత్తూరు గ్రామంలో మంగళవారం ఆయన దోమల తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దోమ తెరలను గిరిజనులకు అందజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అణుకు, బోనుకొత్తూరు, కోదండ రాంపురం, తడపర్తి, అల్లుమియ్యపాలెం, రాచపల్లి గిరిజన గ్రామాలకు దోమతెరలు మంజూరైనట్టు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఉప సర్పంచ్ గొల్లు నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు తిరుమలరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వితరణ



దివ్యాంగులకు డైపర్స్ అందజేస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : కొండకర్ల ఆవకు సమీపంలో ఉన్న ఇచ్ఛా ఫౌండేషన్‌లో దివ్యాంగ పిల్లలకు అనకాపల్లికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మంగళవారం డైపర్స్ పంపిణీ చేశారు. సుమారు రూ.8వేల విలువ గల డైపర్స్, స్వీట్స్‌ను ఫౌండేషన్ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, సెక్రటరీ ఉమా మహేశ్వరీ, ట్రెజరర్ శ్రీదేవి, బాంధవి, సరస్వతి, ఫణి, లత పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం గాలికి

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'లో ధర్మశ్రీ ధ్వజం



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం గురించి కాకుండా ప్రతీకార చర్యలకు ప్రాధాన్యత ఇస్తుందని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆరోపించారు. రాంబిల్లి మండలం అప్పన్నపాలెం, గజిరెడ్డిపాలెం, రాంబిల్లి యాతపేటల్లో మంగళవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అప్పన్నపాలెంకు చెందిన 43 మందికి గ్రామ సభలో లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయించి ఇప్పుడు తొలగించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. సదరు 43 మంది గురించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాతానని హామీ ఇచ్చారు. ముందుగా అర్హులుగా నిర్ణయించి, తర్వాత వారి స్థానంలో వేరొకరికి పార్టీ పరంగా ఇళ్లు ఇవ్వాలని ఎంపిక చేయడం అన్యాయమన్నారు. అప్పన్నపాలెంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గొరపూడి పంచాయతీలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఎంపికలో కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. నేవల్ బేస్ ప్రభావిత గ్రామాల విషయంలో కాలయాపన ధోరణి ప్రదర్శిస్తూ, ప్రత్యామ్నాయాలు చూపకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరూ గమనిస్తున్నారని చెప్పారు. యూరియా కోసం రైతులు రోడ్డెక్కినా, ప్రజారోగ్యం కోసం మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై పోరాటం చేస్తున్నా స్పందించని కూటమి నేతలు.. రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణాలు, రోడ్ల విస్తరణలకు సంబంధించి కాంట్రాక్ట్‌ల కోసం పోటీ పడుతున్నారని విమర్శించారు. ఎంపీపీ శిరీష శ్రీనుబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కిశోర్, అబద్ధం, లోవతల్లి, రాజు, గణేశ్, చిట్టిబాబు, చిన సత్యం, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం అదే హైరానా!



అరబుపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: యూరియా కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. వచ్చే అరకొర యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. సీజన్‌లో అవసరమైన యూరియాను అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. మంగళవారం మండలంలోని అరబుపాలెం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీ చేయనున్నట్టు అధికారులు సమాచారం ఇవ్వడంతో రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. మహిళా రైతులు సైతం గంటల కొద్దీ యూరియా కోసం క్యూలో నిరీక్షించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా రైతు సేవా కేంద్రానికి యూరియా రావడం, రైతులు క్యూలో బారులు తీరడం చూస్తే మునుపెన్నడూ ఇలాంటి కష్టాలు ఎదురవ్వలేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వడంతో పంటల సాగుకు ఇలా అయితే ఎలా అంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సీజన్‌లో రైతులకు ఎంత మేర ఎరువులు అవసరమో గుర్తించి అందుకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాలుగా రైతులకు కష్టాలు తప్పలేదు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

యలమంచిలి రూరల్: మండలంలోని తెరువుపల్లి, పురుషోత్తపురం, రుక్మిణీపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకురాలు కె.జాహ్నవి, ఏవో మోహన్‌రావు ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు సంబంధించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ పంట నమోదు వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. మండలంలో యూరియా కొరత లేదని ఏడీఏ జాహ్నవి తెలిపారు. యలమంచిలి, షేకిళ్లపాలెం, ఏటికొప్పాక, కృష్ణాపురం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో మొత్తం 40 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, వ్యవసాయ విస్తరణాధికారి నారాయణ రావు, వీఆర్వో పార్వతమ్మ పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ వరి పంట సమగ్ర సస్యరక్షణ ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పించారు. బీసీటీ కేవీకే హరిపురం శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. నానో యూరియా, నానో డీఏపీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, వీహెచ్ఏ ప్రియాంక, వీరబాబు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

140 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

యలమంచిలి రూరల్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం యలమంచిలిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఐకాన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 140 మంది రక్తదానం చేశారు. అంతకు ముందు ఈ శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఆడారి శ్రీధర్(చిన్నా), ఆడారి పూరీ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.